క్లుప్తంగా


రేపు వేలంపాట

ముద్దనూరు : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బస్టాండు, జంతువధశాల, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణలకు వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరసింహులు పత్రికాప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి బస్టాండు వేలంపాటకు రూ.2లక్షల డిపాజిట్, జంతువధ శాలకు రూ.20వేలు, సులభ్ కాంప్లెక్స్‌కు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

ఎర్రగుంట్ల : పట్టణంలోని కడప రోడ్డులో విశ్వ హిందూ పరిషత్ నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విశేష సంపర్క ప్రముఖ్ కాల్వల చలపతి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్ ఎన్నిక


చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి


వైస్ చైర్మన్ కాల్వ నాగభూషణం

చక్రాయపేట : చక్రాయపేటలోని శ్రీ వేంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మోపూరి రామాంజనేయరెడ్డిని బుధవారం ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆలయాల ఆవరణలో అనంతపద్మనాభ శర్మచే పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి ప్రత్యేక పూజల అనంతరం ఈ ఎన్నిక జరిగింది. వైస్ చైర్మన్‌గా దళిత వర్గానికి చెందిన కాల్వ నాగభూషణంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల అభివద్ధి కోసం నిరంతర కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు చక్రపాణిరెడ్డి, ఓబుళరెడ్డి, హరనాథరెడ్డి, సభ్యులు ఈశ్వరయ్య, రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి

వేముల : మండల కేంద్రమైన వేముల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకుని హిందు ఉపాధ్యాయ సమితి రూపొందించిన తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. త్రిమత గురువు సామ్రాజ్య చక్రవర్తి ఆచార్య ప్రభోదానంద యోగీశ్వర్లు ఆశీస్సులతో తయారు చేసిన తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ప్రభోదానంద శిష్యులు రామాంజనేయులు, హరిశివ, నరహరి, పోతులూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కుందేళ్ల పార్వేటకు సర్వం సిద్ధం


పట్టుబడిన కుందేళ్లను చూపుతున్న యువకులు

లింగాల : ఉగాది పండుగ తర్వాత పౌర్ణమి రోజున లింగాల మండల కేంద్రంలో కుందేళ్ల పార్వేట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఎగువ లింగాలకు చెందిన యువకులు ఉగాది పండుగ రోజున అడవికి వెళ్లి వలలు పన్ని కుందేళ్లను వేటాడి ప్రాణాలతో పట్టుకున్నారు. గురువారం సాయంత్రం సమీపంలోని బీడు పొలాల్లో పార్వేట నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పౌర్ణమి రోజు సాయంత్రం ఎగువ లింగాల రామాలయం నుంచి స్వామివారికి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి డప్పులు, మేళ తాళాలతో పట్టుబడిన కుందేళ్లను తీసుకుని ఊరేగింపుగా గ్రామ పొలాలకు చేరుకుంటారు. అక్కడ రామ భజనలు నిర్వహించి ప్రజల మధ్య కుందేళ్ల పార్వేటను నిర్వహించనున్నారు.

క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తైక్వాండో శిక్షకుడు జంషీర్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు తైక్వాండోలో బ్లాక్ బెల్ట్‌కు అర్హత సాధించారు. ఎస్. సద్రిఅలం, అభిషేక్, ఉమర్‌అబ్దుల్లా, హలీమ సాదియ, అలకనంద, హృదయకుమార్ బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్‌లు సాధించడంపై కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు క్రీడాకారులను అభినందించారు.

భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు

కమలాపురం : తెలుగు నూతన సంవత్సరం(ఉగాది) వేడుకలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడకలను ప్రజలు మండలంలోని ఊరూరా వైభవంగా నిర్వహించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని తెల్లవారు జామున నుంచే పిల్లా పెద్ద తేడా లేకుండా తలస్నానాలాచరించి నూతన సాంప్రదాయ వస్త్రాలు ధరించి సమీపంలోని ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త ఏడాది అన్ని వర్గాల ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని వేడుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

సర్వ ఆదాయం 109 ...సర్వ వ్యయం 95...

శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో ఆదాయం ఎక్కువ, వ్యయం తక్కువగా ఉందని ప్రముఖ వేద పండితులు పవన్‌కుమార్ శర్మ తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని స్థానిక అమ్మవారి శాలలో ఆయన పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. సర్వ ఆదాయం 109 ఉందని, సర్వ వ్యయం 95 ఉందన్నారు. ఈ ఏడాది బుధుడు అధిపతిగా ఉంటాడని దీంతో సర్వం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. ధాన్యం ధరలు తగ్గుతాయన్నారు. పాలకులు సుభిక్షంగా ఉంటారని, తద్వారా వారు మంచి పాలన అందిస్తారన్నారు. అలాగే చదిపిరాళ్లలోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు రామ కేశవ శర్మ, ఎర్రగుడిపాడులోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో వేద పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వీరపునాయునిపల్లె : గ్రామోత్సవంలో చెన్నకేశవస్వామి

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలో శ్రీ శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయాలలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ప్రజలు లేచి పుణ్య స్నానాలను ఆచరించి ఇంటి దేవుని మూల తమ ఆరాధ్య దైవానికి పల్లెం వేశారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో పురోహితులు కృష్ణరాజేష్ శర్మ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ ఏడాది రైతులకు, వ్యాపారస్తులకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందన్నారు. వర్షాలు మెండుగా ఉన్నాయని.. నల్లరేగడి భూములు పంటలు బాగా పండుతాయన్నారు. బంగారం ధరలు పెరిగి చిరుధాన్యాలకు బాగా గిట్టుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, సర్వేశ్వరుడు, సుబ్బరాయుడు, సుబ్రమణ్యం, జగన్, నాగ శేఖర్, హరి, సాయిప్రసాద్‌లు పాల్గొన్నారు.


లింగాలలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నల్లపురెడ్డిపల్లె, మోట్నూతలపల్లె, అచ్చివెళ్లి, ఎర్రిపల్లె, రాయలాపురం, తుమ్మల పల్లె తదితర గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.

గండిలో వైభవంగా పంచాంగ శ్రవణం

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపారాయణం రామమోహనశర్మ ఆలయ సహాయ కమిషనర్ ఆలవలపాటి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలో నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగు లోగిళ్లు పసుపు, కుంకుమలతో, పూలమాలలతో, మామిడి తోరణాలతో కళకళలాడాయి. ఆడబిడ్డలు, అల్లుళ్లు, పిల్ల పాపలతో ప్రజలు పిండి వంటలను ఆరగించి ఆహ్లాదంగా గడిపారు. గ్రామాల్లోని అన్ని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడపడుచులు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. నూతన తెలుగు సంవత్సరంలో పాడి పంటలతో తులతూగాలని గ్రామ దేవతలకు మొక్కుకున్నారు.

వల్లూరులో..

వల్లూరు : తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను మండలంలోని ప్రజలు బుధవారం జరుపుకున్నారు. పిల్లలు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. ఆలయాలలో, గృహాలలో ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంచి పెట్టారు. పలు గ్రామాలలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరంలో తమ రాశి ఫలాలను గురించి ప్రజలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపించారు. పంటలు దిగుబడులు , ధరలు, వర్షాలు, రాజకీయాల స్థితి గతులను గురించి తెలుసుకోవడానికి ఉత్సాహం చూపారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీలలో వసంతోత్సవాన్ని యువకులు ఉత్సాహంగా జరుపుకున్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వేంపల్లెలో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. దేవుని దగ్గర కొత్త బట్టలు, పుస్తకాలు పెట్టి పూజించారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది ప్రారంభం నుంచి తెలుగు వారి ఇంట సిరులు కురవాలని కోరుకున్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి ఆలయంలో భక్తులందరికి ఉగాది పచ్చడి, పానకం పంచిపెట్టారు. ఆలయ అర్చకులు హరిప్రవీణ్, శంకరమంచి ప్రసాద్ శర్మల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.వెంకటేష్, కమిటీ సభ్యులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : మండల ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం తెల్లవారు జామునుంచే మహిళలు ఇళ్ల ముంగిట కల్లాపిచల్లి, అనంతరం పిండి వంటలు తయారు చేసుకుని తమ ఇళ్లలో ఇంటి పెద్దలకు పల్లెం పెట్టారు. ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని తొండూరు పాటిమీద ఆంజనేయస్వామి ఆలయం, సాయిబాబా ఆలయం తదితర ఆలయాలకు భక్తులు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ఈ ఏడాది దేశంలో సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండుతాయని పంచాంగ శ్రవణ పఠనం నంద్యాల నాగరాజు శర్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని పెన్ననర్ల భవనంలో పెన్ననర్ల సంఘం గౌరవాధ్యక్షులు పొన్నారి దస్తగిరి ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు దేవదానం, కార్యదర్శి రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గండిలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పండితులు


దుగ్గాయపల్లెలో రంగులు చల్లుకుంటున్న యువకులు


వెయ్యినూతలకోనలో కల్యాణంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వాముల వారు


కమలాపురం : పోలీస్ స్టేషన్‌లో సాంప్రదాయ దుస్తుల్లో సీఐ, పోలీస్ సిబ్బంది

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : ఉగాది పండుగను పురస్కరించుకుని మండంలోని ఎన్. పాలగిరి గ్రామంలో లక్ష్మీదేవి సమేత చెన్నకేశవస్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. గ్రామోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను అలంకరించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : తెలుగు ప్రజల నూతన సంవత్సరం ఉగాది పర్వదిన వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను సందర్శించారు. పురోహితులు ఆలయాల్లో పంచాంగ శ్రవణంగావించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని వెయ్యినూతల కోనక్షేత్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్ల కల్యాణం బుధవారం ఆలయ కార్యనిర్వాహకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెలుగు సంవత్సరంలో వచ్చే మొదటి పండుగ కావడంతో ఉగాది పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పండుగకు నూతన వస్త్రాలు ధరించి పెద్దలకు పల్లెం వేసి పండుగను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం (రేపు) ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 99631 70177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీల ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న వర్కర్, హెల్పర్‌ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సుజామణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె అందులో పేర్కొన్నారు. ఖాళీల వివరాలను, రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం మండలం అప్పారావుపల్లె-ఆయా (బీసీ-డీ), ఎర్రగుంట్ల మండలం కేజీవీపల్లె-వర్కర్ (ఓసీ), తిప్పలూరు-వర్కర్ (ఓహెచ్), బిస్మిల్లాబాద్ -ఆయా (ఎస్టీ), వీరపునాయునిపల్లె మండలం అంకిరెడ్డిపల్లె-వర్కర్ (ఎస్టీ), ఎ.ఓబాయపల్లె-ఆయా (వీహెచ్), ఉరుటూరు-1- ఆయా (బీసీ-సీ) ఈ స్థానాల భర్తీకి రోస్టర్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆమె తెలిపారు. ఈనెల 27వ తేదీ లోగా అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను కమలాపురంలోని ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. 10వ తరగతి పాసై, 21సం. పూర్తి అయి 35ఏళ్ల లోపు ఉన్న వారే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆమె అన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

వల్లూరులో..

వల్లూరు : కడప రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వల్లూరు మండలంలో ఖాళీగా వున్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు ఈనెల 27వ తేదీలోపు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో చిన్నపుత్త, కుముద్‌బెన్‌జోషి నగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో సహాయకురాలు పోస్టులు ఖాళీగా వున్నాయని తెలిపారు. ఇందులో చిన్నపుత్త అంగన్ వాడీ సహాయకురాలు పోస్టు ఓసీలకు, కుముద్‌బెన్‌జోషి నగర్ అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు ఎస్టీలకు కేటాయించబడిందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడాటాతో అన్ని ధృవీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించి వాటిని కడప రూరల్ ఐసీడీఎస్ కార్యాలయంలో అందచేయాలని తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని జమ్మలమడుగు, పెద్దముడియం, రాజుపాలెం మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్ట్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎస్.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగులోని కన్నెలూరు-2లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్ట్ ఓసికి, కన్నెలూర్-3లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్ట్ ఓసీకి, రాజుపాలెం మండలంలోని వెలవలి-1లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్ట్ ఈడబ్ల్యూఎస్‌కు మరియు రాజుపాలెం మండలంలోని వెలవలి-2లో అంగన్‌వాడీ కార్యకర్త బీసీలకు, గాదెగూడూరు-1లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్ట్‌కు ఎస్‌సీలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. పెద్దముడియం మండలంలోని పెద్దపసుపల-6లో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్ట్‌కు ఓసీకి కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఈనెల 27వ తేదీ ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

వైభవంగా కొండగంగమ్మ తిరునాల

పెండ్లిమర్రి : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండగంగమ్మ తిరునాల ఉత్సవాలు బుధవారం వైభవంగా అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఆకుపూజ, అభిషేకాలకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ రామమోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీలో గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలిశివ, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు రామమోహన్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి జాతర

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతర కన్నుల పండువగా సాగుతోంది. బుధవారం ఉదయం 3 గంటలకు గంగమ్మతల్లి ప్రతిమను ప్రతిష్ఠించారు. గంగమ్మతల్లితో పాటు బోగాదమ్మ, చౌడమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. చౌడమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఎటువంటి సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్‌ఐ రాజారమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకు గంగమ్మతల్లి ప్రతిమను గ్రామ పొలిమేర వద్ద విడిచిపెట్టడంతో జాతర ముగుస్తుందని జాతర కమిటీ సభ్యులు తెలిపారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి


ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మతల్లి అమ్మవారు

అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మగూడూరు గ్రామంలో వెలసిన అంకాలమ్మతల్లికి బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయ పూజారి అనిల్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం అంకాలమ్మ ఆలయంలో నూతన పంచాంగ పఠనం గావించారు. బిదినంచర్ల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం, గురిజాల పెద్దమ్మతల్లి ఆలయం, తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం కుందేళ్ల పార్వేట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కుందేళ్ల పార్వేట కార్యక్రమానికి గ్రామం నుంచేకాకుండా చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని వారు తెలిపారు.

జమ్మలమడుగు తహసీల్దార్‌గా రమేష్


బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రమేష్‌ను అభినందిస్తున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు తహసీల్దార్‌గా రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై జమ్మలమడుగు తహసీల్దార్‌గా నియమించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రవీంద్రారెడ్డి శెలవుపై వెళ్లడంతో అధికారులు కొత్త తహసీల్దార్‌ను నియమించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే

– వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్

పులివెందుల రూరల్ : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ పేర్కొన్నారు. పులివెందులలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులపై ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు రావడం చూస్తే నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని పేర్కొన్నారు. కలగూర గంపలా మిగిలిన అభ్యర్థుల ఓట్లను కలిపితేనే టీడీపీ అభ్యర్థి గెలవలేని పరిస్థితి ఉందని తేలిపోయిందన్నారు. దీన్ని బట్టి చూస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు సింగిల్‌గా పోటీ చేసే దమ్ము, ధైర్యం టీడీపీ, మిగిలిన పార్టీలకు లేదన్నది అక్షరాలా రుజువైందన్నారు. పులివెందుల మున్సిపల్ పరిధిలో పోటీ చేసే దమ్ము టీడీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. మండలి ఎన్నికలను వైఎస్సార్‌సీపీ పెద్దగా పట్టించుకోలేదన్నారు.

పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరం అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహత్ మదరసాలో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం పేదలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వారికి బియ్యం ప్యాకెట్లతోపాటు రంజాన్‌కు అవసరమైన ఇతర నిత్యావసర సరుకులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఏడురోడ్ల మసీదు ఇమామ్ హజరత్ వలీవుల్లా హుసేనీ సాహెబ్ మాట్లాడుతూ కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా రంజాన్ కిట్లు పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు.


రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

ముస్తాబైన జామియా మసీదు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రముఖమైన జామియా మసీదును అందంగా ముస్తాబు చేశారు. శుక్రవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానుండటంతో మసీదుకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రస్తుతం మసీదుకు అధికారిక కమిటీ లేకపోవడంతో ఎమ్మెల్యే రాచమల్లు 23 మందితో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధతో మసీదును అందంగా తయారు చేయడంతోపాటు ఉపవాసాల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


కార్యక్రమాలను తిలకిస్తున్న సందర్శకులు


శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక శిల్పారామంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉదయం ఉగాది పండుగను పురస్కరించుకుని సోమేపల్లె వెంకటేశ్వరశర్మచే తెలుగు సంవత్సర ఉగాది పంచాంగ పఠనం నిర్వహించారు. అనంతరం యువరాజు డ్యాన్సింగ్ చిన్నారుల శాస్త్రీయ, జానపద, కోలాట, సినీ పాటలకు వేసిన స్టెప్పులు అందరిని అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తిలకించారు.